# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-3 తేదిః 04.9.2014.

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను తెలంగాణలో అందించడానికి ప్రభుత్వం వచ్చే ఏడాది నుండి కొత్త కార్యక్రమాలు, కొత్త పథకాలు అమలు చేస్తుందని ఇందుకు బ్రిటన్ సహకారం తీసుకుంటామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వెల్లడించారు.

సచివాలయంలో బ్రిటన్ సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి రాబ్‌లైన్స్, బ్రిటన్ డిప్యూటి హైకమీషనర్ అండ్రూ మెక్ అలిస్టర్ ముఖ్యమంత్రి కేసిఆర్‌ను కలుసుకున్నారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం తదితర రంగాలలో పరస్పరం సహకరించుకునే విషయాలపై చర్చించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకుందని, అవి చాలా బాగున్నాయని బ్రిటన్ ప్రతినిధులు అభినందించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడానికి, తెలంగాణలో గ్రిన్ కవర్ పెంచడానికి, విద్యార్థులకు ఇంగ్లీషు మీడియంలో ఉచిత నిర్బంధ విద్య అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలను వారు మెచ్చుకున్నారు. ఈ రంగాలలో తెలంగాణ ప్రభుత్వానికి తాము కూడా సహకరిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణలో వచ్చే ఏడాది విద్యా సంవత్సరం నుండి విద్యారంగంలో సమూల మార్పులు తెస్తామని, ఇంగ్లీషు మీడియంలో ఉచిత నిర్బంధ విద్య అందిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకోసం మాస్టర్ ట్రైనర్లకు అవసరమైన శిక్షణను అందించడానికి సహకరించాలని ముఖ్యమంత్రి బ్రిటన్ ప్రతినిధులను కోరారు. తెలంగాణలో ఇంజనీరింగ్ కాలేజీలను పరిశ్రమలకు అనుసంధానం చేస్తున్నామని, దీనివల్ల విద్యార్థులు చదువుకునే సమయంలోనే వృత్తి విద్యను నేర్చుకుంటారని, వృత్తి నైపుణ్యం కూడా పెరుగుతుందని తాము భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సందర్భంలో

కూడా బ్రిటన్ సహకారం అవసరమని ముఖ్యమంత్రి కోరారు. బ్రిటన్‌లో మ్యూజియంల నిర్వహణ కూడా బాగుంటుందని, బ్రిటిష్ మ్యూజియం లీడర్ షిప్ ప్రోగ్రాం కూడా అక్కడ వుందని ముఖ్యమంత్రి చెప్పారు. షేక్స్పియర్ ఇంటిని హెరిటేజ్ ప్రాపర్టీగా మార్చారని అభినందించారు. ఇదే విధంగా సాలార్ జంగ్ మ్యూజియాన్ని కూడా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. వాతావరణ సమతుల్యం కోసం గ్రీన్ మాస్టర్ ప్లాన్ కార్యక్రమాలకు తామ సహకారం వుంటుందని ముఖ్యమంత్రికి బ్రిటన్ ప్రతినిధులు హామినిచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సీఫెల్‌లో తాము కాన్ఫరెన్సు నిర్వహిస్తున్నామని, ఇందుకు సహకారం అందించాలని కూడా ముఖ్యమంత్రిని వారు కోరారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, పరిశ్రమల శాఖ కార్యదర్శి ప్రదీప్ చంద్ర, సిఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టూ సిఎం